క్లుప్తంగా

తుల్జాభవాని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



గచ్చిబౌలి: సీఎం కేసీఆర్‌తో పాటు మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తుల్జా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మహారాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లాలోని తుల్జాపూర్‌లో తుల్జా భవాని శక్తి పీఠాన్ని దర్శించుకున్నారు.

'మనూ'లో దూరవిద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూరవిద్యలో వివిధ కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా డిప్లొమో ఇన్ ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్, ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ పేరిట రెండు కోర్సులు ప్రవేశ పెట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జూలైలో ప్రారంభమయ్యే 2023–24 అకడమిక్ సెషన్‌లో ఇంగ్లిష్ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యత, సర్టిఫికెట్ ఇన్ ఫంక్షనల్ ఇంగ్లిష్ వంటి కోర్సులు కూడా ఉన్నాయి. వీటిని ఆగస్టులో ప్రారంభిస్తారు. బీఈడీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం సమర్పించడానికి చివరి తేదీగా జూలై 25గా నిర్ధారించారు. ఇతర అన్ని కోర్సులకు 25 ఆగస్టు చివరి తేదీ. అడ్మిషన్ల కోసం ఈ–ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలు manuu.edu.in/ddeలో అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాల కోసం దరఖాస్తుదారులు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్(ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్లు 040–23008463 లేదా 040–23120600 (ఎక్స్‌టెన్షన్ 2207 మరియు 2208లో సంప్రదించవచ్చు.

డ్రంకన్ డ్రైవ్.. 17మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: ఇటీవల పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు మంగళవారం సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 17మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

వెల్‌స్పన్‌కు ప్రగతి పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ బహుళ జాతి సంస్థలలో ఒకటైన వెల్‌స్పన్, రాష్ట్ర అభివృద్ధిలో పోషిస్తున్న పాత్రకు తగిన గుర్తింపును అందుకుంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్ని పురస్కరించుకొని, తెలంగాణలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి వెల్‌స్పన్ అందిస్తున్న సహకారానికి అభినందనగా అవార్డుతో పాటు, పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో మరో పురస్కారాన్ని కూడా అందుకుంది. ఈ సందర్భంగా వెల్‌స్పన్ యాజమాన్యం తన సిబ్బందికి అభినందనలు తెలియజేసింది.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ ఒక శక్తివంతంగా తయారైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పెంటారెడ్డి, కృష్ణారెడ్డి, రాములుయాదవ్, బసమ్మ, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని క్రెడిట్ కార్డు నుంచి రూ.3.50 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మిహోమ్స్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి చెందిన క్రెడిట్ కార్డు నుంచి ఏప్రిల్ 22వ తేదీన సైబర్ నేరగాళ్లు పలు ధఫాలుగా రూ.3.50 లక్షలు కాజేశారు. గమనించిన ఉద్యోగిని ముందుగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసింది. అనంతరం మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ వార్డు కార్యాలయం, సోమేశ్వర ఆలయం వద్ద డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు.

సెల్లార్.. స్పెషల్ డ్రైవ్



- పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యలు: జడ్‌పీ శంకరయ్య

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని సెల్లార్ తవ్వకాలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలంలో సెల్లార్ తవ్వకాలు చేపట్టవద్దని ఆదేశాలు సైతం జారీ చేశారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలోని సెల్లార్ తవ్వకాలను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలని సెల్లార్ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. వెస్ట్ జోనల్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో 39 సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. యూసుఫ్‌గూడలో రెండు, శేరిలింగంపల్లిలో 19, చందానగర్‌లో 14, ఆర్సీపురం పటాన్‌చెరులో 4 సెల్లార్ల తవ్వకాలు చేస్తున్నారు. యూసుఫ్‌గూడలో ఓ సెల్లార్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే 20 సెల్లార్లకు నోటీసులు జారీ చేశారు. మరో 19 సెల్లార్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొంటున్నారు.



సెల్లార్ తవ్వకాలను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

వర్షాకాలంలో ప్రమాదాలు

వర్షాకాలం సెల్లార్ తవ్వకాలు చేపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. వర్షాలకు సెల్లార్ దారులు పూడుకుపోవడం, నీరు నిలవడంతో అక్కడ ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ అధికారులు వర్షాకాలం సెల్లార్ల తవ్వకాలపై నిషేధం విధిస్తున్నారు.

జీహెచ్ఎంసీ గైడ్ లైన్స్ ఇవే...

- వర్షాకాలం కంటే ముందే ప్రారంభమైన సెల్లార్ తవ్వకాలు అనుమతి ప్రకారం ఖచ్చితమైన సెట్ బ్యాక్స్ పాటించాలి.
- సాయిల్ స్ట్రెస్, రిటైనింగ్ వాల్, బారికేడ్ల ఏర్పాటు తప్పని సరిగా ఉండాలి.
- పక్క నిర్మాణాలకు ముప్పు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలి.
- సెల్లార్ తవ్వకాలు జరిపే చోట లేబర్ క్యాంపులు ఉంచరాదు. అలాంటివి ఉంటే నోటీసులు ఇచ్చి వెంటనే పక్కకు తరలించాలి.
- ప్రమాదకరంగా ఉన్న సెల్లార్లలో పనులు నిలిపివేయాలి.
- జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించని సెల్లార్ తవ్వకాలను నిలిపివేయడంతో బాటు అనుమతి రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.
- కొత్తగా చేపట్టే సెల్లార్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదు.

జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలి



వర్షాకాలంలో సెల్లార్ తవ్వకాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రమాదాలను నివారించేందుకు వెస్ట్ జోనల్ పరిధిలోని సెల్లార్లను గుర్తించాం. ఇప్పటికే పనులు ప్రారంభించిన వారు తీసుకోవాల్సిన భద్రతా చర్యలను తెలియజేశాం. సెల్లార్ తవ్వకాలు చేపట్టే యజమానులు, కాంట్రాక్టర్లు ఖచ్చితంగా జీహెచ్ఎంసీ గైడ్‌లైన్స్ పాటించాలి. గైడ్ లైన్స్ పాటించని, ప్రమాదకరంగా ఉన్న సెల్లార్ల పనులను నిలిపివేస్తాం.

– జి.శంకరయ్య, కమిషనర్, వెస్ట్ జోన్

డ్రగ్స్ వద్దంటూ.. విద్యార్థుల ప్రతిజ్ఞ



గచ్చిబౌలి: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఇంటర్నేషనల్ యాంటి డ్రగ్స్ డేను పురస్కరించుకొని మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని మాదాపూర్ జోన్ పరిధిలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. పాఠశాలల భద్రత, క్లబ్‌లు, డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు గచ్చిబౌలిలోని విజయ భారతి హై స్కూల్, ప్రగతినగర్‌లోని గీతాంజలి స్కూల్, భెల్‌లోని విద్యా భారతి, మణికొండలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, కూకట్‌పల్లిలోని గీతాంజలి దేవకుల్, ఎస్ఎంపీ ఇంటర్నేషనల్ స్కూల్, మదీనాగూడలోని సెయింట్ యాన్స్, మేరు ఇంటర్నేషనల్ స్కూల్, శాన్ ఫోర్ట్ మోడల్‌స్కూల్ విద్యార్థుల ద్వారా నినాదాలు రాయించి సందేశం ఇచ్చారని డీసీపీ తెలిపారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



శేరిలింగంపల్లి: సర్వీస్ రోడ్డులో మ్యాన్‌హోల్ ధ్వంసం కావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల రైల్వేఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో వెళ్ళే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మ్యాన్‌హోల్ ధ్వంసం అయిన విషయాన్ని సీవరేజ్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాటలు తప్ప అభివృద్ధి శూన్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో 64వ రోజు గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు, కాలనీలు, బస్తీలు అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. నేటి ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో హామీలు ఇచ్చి తీర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, మదనాచారి, మధు యాదవ్, శ్రీధర్, రాము, సూర్య, రాము, గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్

ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలి

కూకట్‌పల్లి: వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు, స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని కూకట్‌పల్లి డీఈ చక్రవరి, ఏడీఈలు ప్రసాద్, హరికృష్ణలు సూచించారు. బలమైన గాలులు వీచినప్పుడు ప్రజలు విద్యుత్ లైన్ల కింద ఉండవద్దని, విద్యుత్ వైర్లు తెగిపడినప్పుడు వెంటనే విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలని తెలిపారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ ఐరన్, సిమెంట్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో విద్యుత్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు, అంతరాయాలు కలిగితే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9490153502కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్: వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ, నర్రాబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. గోకుల్‌నగర్ కాలనీలో మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో జీహెచ్ఎంసీ సిబ్బందితో పూడిక తీయించారు. అనంతరం కుమార్‌యాదవ్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆహ్వానం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ స్వతంత్ర కార్పొరేటర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం కందుల కూచిపూడి నాట్యాలయ అకాడమీ సభ్యులు మేయర్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జులై 15న కూచిపూడి నాట్యాలయం అకాడమీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో నిర్వహించనున్న వేడుకలకు రావాలని కోరుతూ అకాడమీ నిర్వాహకుడు రవి ఆహ్వాన పత్రికను అందజేశారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం



సీవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటుపై చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం డివిజన్ పరిధిలోని కల్వరి టెంపుల్, శ్రీల, బుద్ధ వర్టెక్స్, విశ్వంభరా, డ్రీమ్ వ్యూ కాలనీలో సీవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీజీఎం శంషేర్, డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డిఇ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు



మోతీనగర్: జులై 2వ తేదీన జరగనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా ఆధ్వర్యంలో మంగళవారం అల్లాపూర్‌లోని శ్రీ అమృత కాలేజ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు హాజరై విద్యార్థులకు క్విజ్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొని విలువైన బహుమతులు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, యూత్ కాంగ్రెస్ నాయకులు పల్లపు వేణు, ఇలియాస్, బండారి ప్రవీణ్‌గౌడ్, వంశీ వర్ధన్, నిఖిల్, సాయి తేజ, సాయి మణికంఠ, గౌతమ్, ప్రణతి పాల్గొన్నారు.



నేటి నుంచి డబుల్ ఇళ్ల దరఖాస్తుల సర్వే

- సర్కిల్ –21 పరిధిలో 8,389 దరఖాస్తులు
- 15 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం

హఫీజ్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించనున్న నేపథ్యంలో తుది జాబితా రెడీ చేయడానికి జీహెచ్ఎంసీ, మండల రెవెన్యూ అధికారులు దరఖాస్తుల సర్వే చేయనున్నారు. ఈ సందర్భంగా చందానగర్ సర్కిల్ 21 ఉప కమిషనర్ సుధాంషు నందగిరి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సర్కిల్– 21 పరిధిలో డబుల్ ఇళ్లకు 8389 దరఖాస్తులు వచ్చాయని, బుధవారం నుంచి దరఖాస్తులను పరిశీలించి తరువాత సర్వే చేయనున్నారన్నారు. గతంలో యాప్ ద్వారా ఓటర్ కార్డు, సెల్ ఫోన్ నంబర్లు సేకరించామని, ఆ వివరాల ప్రకారం సర్వే చేస్తామన్నారు. సర్వేలో మొత్తం 14 టీమ్‌లు ఉండగా ఒక్కొక్క టీంలో బిల్ కలెక్టర్, మండల రెవెన్యూ సిబ్బంది ఉంటారన్నారు. 15 రోజుల్లో సర్వే పూర్తి చేసి తుదిజాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నామన్నారు.

- రిజర్వేషన్ కింద ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 6 శాతం, మైనార్టీలకు 12 శాతం, ఇతరులకు 65 శాతం ఇవ్వనున్నారన్నారు.

అనర్హత..

- జీఓ 58, 59 కింద ఇళ్ల పట్టాలు పొందిన వారు... (జీఓ 58 కింద 30–12–2014 పొందిన వారు, జీఓ 59 కింద 30–12–2014 పొందిన వారు)
- పక్కా ఇళ్లు భర్త, భార్య పేర్ల మీద ఉండకూడదు
- రాష్ట్ర ప్రభుత్వం కింద గతంలో రూరల్, అర్బన్ పరిధిలో ఇళ్ళు పొందిన వారు, ఇందిరమ్మ ఇళ్ళు, జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రాజీవ్ గృహకల్పలో ఇళ్లు తీసుకున్నవారు అనర్హులుగా పేర్కొన్నారు.

అర్హత ఇలా..

- 2018వ సంవత్సరం వరకు ఓటర్ కార్డులో నమోదై ఉండాలి.
- ఆధార్ కార్డు, ఓటర్ కార్డు ఒకే నియోజకవర్గంలో, జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండాలి
- జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి

యువ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



రాయదుర్గం: యువ ఓటర్లు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్ స్పష్టం చేశారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నక్కా సామ్రాట్‌గౌడ్ ఆధ్వర్యంలో యువ ఓటరు నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు బీజేవైఎం కృషి చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహారధాన్యాలు అందించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సురేష్‌ముదిరాజ్, మహేందర్‌గౌడ్, నరేందర్‌యాదవ్, సతీష్‌గౌడ్, అమర్, నవీన్‌రెడ్డి, రాఘవేందర్ ముదిరాజ్, సంతోష్‌సింగ్, ధరణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

పటాన్‌చెరు టౌన్: జిల్లాలో మన ఊరు– మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెరిగాయన్నారు.

మద్యం సేవించడానికి వచ్చి...

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించడానికి వచ్చి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం...మధ్యప్రదేశ్‌కు చెందిన రిషి వీకే(40) ఆరునెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం పా టి గ్రామ సమీపంలోని ఓ నిర్మాణ రంగ సంస్థ వద్ద కూలీ పని చేస్తున్నాడు ఈ క్రమంలోనే మద్యానికి బానిస అయిన రిషి కూలి డబ్బులు తాగేందుకు ఖర్చు చేసేవాడు. సోమవారం మద్యం సేవించడానికి వెళ్లి, రామచంద్రాపురం పరిధిలోని వెలమెల చౌరస్తాలో ఓ షాపు ముందు గాయాలతో పడి ఉండడాన్ని మంగళవారం ఉదయం స్థానికులు, షాపు నిర్వాహకులు గుర్తించారు. వివరాలు అడగగా, చెప్పి మంచినీరు అడిగాడు. తాగిన కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో సుమారు రూ.19.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంగవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బస్తీ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, పద్మారావు, శ్రీనివాస్, రఘునందన్, అనిల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచరణ్ కాలనీలో..

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్ కాలనీలో రూ.10లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిలవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఇంట్లోకి చొరబడి దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

హఫీజ్‌పేట్ : గోపన్‌పల్లిలో రెండురోజుల క్రితం ఓ మహిళ ఇంట్లోకి చొరబడి దోపిడీకి యత్నించిన వ్యక్తిని చందానగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మెహిదీపట్నం గుడిమల్కాపూర్‌కు చెందిన కల్లెం చిన్న (22) చందానగర్ పాపిరెడ్డికాలనీలో చెత్త సేకరణ చేస్తుండేవాడు. ఆదివారం గోపన్‌పల్లిలో ఓ ఇంట్లోకి చొరబడి దాడికి యత్నించి అంతే కాకుండా పక్కింటి యువకుడిపై కూడా దాడి చేశాడు. అక్కడే ఉన్న స్థానికులు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు పాత నేరస్తుడని అతనిపై 6 కేసులు ఉన్నాయన్నారు.

పటాన్‌చెరు సీఐగా లాల్‌నాయక్

పటాన్‌చెరు టౌన్: ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను నిర్మిస్తామని పటాన్‌చెరు సీఐ లాల్‌నాయక్ అన్నారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి రావడంతో బదిలీపై ఆయన సంగారెడ్డి ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచ్)కి అటాచ్‌పై వెళ్లారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న లాల్‌నాయక్ మంగళవారం పటాన్‌చెరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462